ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎపిఒ సురేష్

ప్రజాశక్తి -గంగవరం : జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎన్ఆర్ఇజిఎస్ ఎపి ప్రకాష్ సిబ్బందికి సూచించారు. గురువారం కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో వారాంతపు సమీక్ష నిర్వహించారు. 60 రోజులు పూర్తి చేసుకున్న అన్ని జాబ్ కార్డు దారులకు 100 రోజులు పని పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించి, పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఫిజికల్ కంప్లీట్‌లో వున్న 100 ఫారం పండ్స్ కాకుండా మిగిలిన 68 ఫారం ఫండ్స్ పనులను వచ్చేనెల 10నాటికి పూర్తిచేయాలన్నారు. సోక్ పిట్‌లన్నీ మొదలు పెట్టి, పూర్తి చేయాలన్నారు. జాబ్‌కార్డు దారులందరికీ 100 రోజులు పనికల్పనలో విఫలమైతే చర్యలు తప్పవన్నారు.

ఏజెన్సీలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

పాడేరు డివిజన్‌లో 88.04, రంపచోడవరం డివిజన్‌లో 77.90 శాతం నమోదు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీ పరిధిలో ఉభయ గోదావరి ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్ల మధ్య గురువారం ప్రశాంతంగా జరిగాయి. గురువారం ఉదయం నిర్ణీత సమయం 8 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు .నాలుగు గంటల వరకు పోలింగ్ సజావుగా సాగింది. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వివిధ మండలాల్లో పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

పాడేరు డివిజన్‌ను నాలుగు జోన్లుగా విభజించి 11 మండల కేంద్రాల్లో బూత్‌లు ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బూత్ నెంబర్ 82 పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి ఉపాధ్యాయులు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 394 ఓట్లకు గాను పోలింగ్ ముగిసే సరికి 350 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 198 మంది మహిళా టీచర్లు 152 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాడేరు డివిజన్‌లో 88.04 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.



బారులు తీరిన ఓటర్లు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
పాడేరు	394	350.
ముంచంగిపుట్టు	: 63	53
పెదబయలు	113	97
హుకుంపేట :	125:	113
అరకు వ్యాలీ	134:	117
డుంబ్రి గుడ	:77	71
అనంతగిరి	62	56.
జి మాడుగుల	48	47
చింతపల్లి	188	160
జీకే వీధి :	123	104
కొయ్యూరు	161	142



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఇలా..

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉమ్మడిగోదారిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయని రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్లో 12 పోలింగ్ స్టేషన్లలో 77.90 శాతం పోలింగ్ జరిగిందనితెలిపారు. ఎటపాక మండలంలో 386 మంది పట్టభద్రుల ఓట్లుండగా పురుషులు 176 మంది, మహిళలు 97 మంది మొత్తం 273 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 70.73 శాతం, కూనవరం మండలంలో 458 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 219 మంది, మహిళలు 138 మంది మొత్తం 357 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.95 శాతం,చింతూరు మండలం లో 388 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 227 మంది, మహిళలు 84 మొత్తం 311మంది ఓటు హక్కు వినియోగించుకోగా 80.15 శాతం, వి ఆర్ పురం మండలంలో 328 మంది పట్టభద్రుల ఓట్లుండగా పురుషులు 202 మంది, మహిళలు 87 మంది మొత్తం 289 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 88.11 శాతం,మారేడుమిల్లి మండలంలో 256 మంది పట్టభద్రుల ఓట్లుండగా పురుషులు 120 మంది, మహిళలు 96 మొత్తం 216 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 84.38 శాతం, వై. రామవరం లోయర్ లో 185 మంది పట్టభద్రుల ఓట్లుండగా పురుషులు 89 మంది, మహిళలు 59 మంది మొత్తం 148 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 80.00 శాతం,వై.రామవరం అప్పర్ లో 25 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 18 మంది, మహిళలు 7 మంది ఓటర్లు మొత్తం 25 మంది హక్కు ఓటు హక్కు వినియోగించుకోగా 100.00 శాతం,అడ్డతీగల మండలంలోని 475 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 240 మంది, మహిళలు 137 మంది మొత్తం 377 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 79.37, రాజవొమ్మంగి మండలంలో 670 మంది పట్టభద్రుల ఓట్లుండగా పురుషులు 333 మంది, మహిళలు 172 మంది మొత్తం 505 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 75.37 శాతం, గంగవరం మండలంలో 326 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 154 మంది, మహిళలు 102 మంది మొత్తం 256 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 78.53 శాతం, రంపచోడవరం మండలంలో 742 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 324 మంది, మహిళలు 232 మంది మొత్తం 556 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 74.93 శాతం, దేవీపట్నం మండలంలోని 430 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా పురుషులు 190 మంది, మహిళలు 134 మంది మొత్తం 324 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 75.35 శాతం ఓటర్లు వినియోగించుకున్నారని సబ్ కలెక్టర్ తెలిపారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం డివిజన్లోని, చింతూరు డివిజన్లోని మొత్తం 12 పోలింగ్ కేంద్రాలలో 4669 ఓట్లకు గాను పురుషులు 2292 మంది, మహిళలు 1345 మంది పట్టభద్రులు తమ తమ ఓటు హక్కును మొత్తం 3637 మంది వినియోగించుకున్నారని, తద్వారా 77.90 శాతం పోలింగ్ నమోదైందన్నారు. రంపచోడవరం జూనియర్ కాలేజీ పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. రంపచోడవరం తాసిల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్. శ్రీనివాసరావు దొర, సిడిపిఒ సంధ్యారాణి,డిప్యూటీ తాసిల్దార్లు సత్యనారాయణ, జిలాని, ఎంఆర్ఐ సిహెచ్ నిర్మల కుమారి, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల



బలిమెల జలాశయం నుంచి విడుదలౌతున్న నీరు

ప్రజాశక్తి -సీలేరు: బలిమెల జలాశయం నుంచి ఏడువేల క్యూసెక్కులు నీటిని తీసుకుంటున్నామని సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్‌కో సూపరెంటిండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రబి పంటకు సీలేరు నది నుంచి నీటిని విడుదల చేయాలని ఎపి జెన్‌కో అధికారులను ఇరిగేషన్ అధికారులు కోరడంతో, దిగువ సీలేరు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా మూడు వేలు క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలు విద్యుదుత్పత్తి అనంతరం 4300 క్యూసెక్కులు కలుపుకొని మొత్తం 7300 క్యూసెక్కులు నీటిని గోదావరి డెల్టా విడుదల చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా జలాశయం గేట్లు ద్వారా 4.17 టీఎంసీలు నీటిని విడుదల చేసామన్నారు. మార్చి 21 వరకు గోదావరి డెల్టాకు నీటి విడుదల కొనసాగించవలసిన నేపథ్యంలో డొంకరాయి జలాశయంలో నీటిమట్టాలు తగ్గకుండా ఉండేందుకుగాను బలిమెల జలాశయం నుంచి ఇప్పటి వరకు తీసుకుంటున్న ఆరువేల క్యూసెక్కుల నీటితో కలిపి అదనంగా మరొక వెయ్యి క్యూసెక్కులు కలుపుకొని ఏడు వేలు క్యూసెక్కులు నీటిని తీసుకుంటున్నామని ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రికార్డు స్థాయిలో జల విద్యుదుత్పత్తి

గడువుకు నెలరోజుల ముందుగానే లక్ష్యానికి మించి సాధన

ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్



జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని స్థానిక జల విద్యుత్ కేంద్రంలో సెంట్రల్ విద్యుత్ సెంట్రల్ అథారిటీ నిర్దేశించిన లక్ష్యానికి మించి విద్యుత్ ఉత్పత్తిని సాధించి రికార్డు నెలకొల్పమని ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2024 -25 మార్చి 31 నాటికి విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉండగా, ఒక నెల రోజులు ముందే టార్గెట్‌ను అధిగమించి విద్యుత్ ఉత్పత్తి సాధించామన్నారు. 2024-25 మార్చి చివరినాటికి 477 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయవలసి ఉండగా ఈనెల 26, బుధవారం రాత్రి 11. 50 గంటలకు 477.644 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పామన్నారు. ఈ ఘనత సాధించడంలో ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఇచిన్న కామేశ్వరరావు, ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి సహాయ సహకారాలతో అరుదైన రికార్డు సాధించామన్నారు. అదేవిధంగా ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ కృషి ఫలితంగానే ఈ రికార్డు సాధ్యమైందన్నారు ముమ్మందు జల విద్యుత్ కేంద్రంలో ఇంజనీర్లు కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు సమిష్టి కృషితో విద్యుదుత్పత్తిలో మరిన్ని రికార్డులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..!




కొండమార్గంలో రోగిని డోలిలో మోసుకెళుతున్న గొడుగులబంద గిరిజనులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప పంచాయతి, గొడుగులబంధ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా, ప్రభుత్వాలు, పాలకులు ఎందరు మారినా, తమకు రహదారి కష్టాలు తప్పడం లేదని, ఏ ఒక్కరూ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అనారోగ్యం, గర్భిణులు డెలివరీలు వంటి అత్యవసర సమయంలో నానాఅగచాట్లు పడుతూ, కొండమార్గంలో డోలీల్లో మోసుకెళ్లి ఆసుపత్రికి తీసుకెళ్లక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. గొడుగులమబంధ మాదిరిగానే అనేక గ్రామాలు రహదారి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు, నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా హామీలే తప్ప రోడ్డు సౌకర్యం కలగడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాలకు రహదారి కల్పన ఎన్నికల హామీగానే మిగిలిపోకుండా, ఇప్పటికైనా సాకారం చేయాలని వేడుకుంటున్నారు.

క్రికెట్ పోటీల నిర్వహణకు ఆర్థికసాయం


ప్రజాశక్తి- అల్లూరి జిల్లా : అల్లూరి జిల్లా, చింతూరు మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటుకు జేకే సిటీ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి, స్నేహభావం పెంపొందించడానికి తోడ్పడతాయని, యువకులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, విద్యలోనూ ప్రతిభ కనపరచాలని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలని జమాల్ ఖాన్ సూచించారు.కార్యక్రమంలో కొత్తపల్లి క్రీడాకారులు, జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్కే రియాజ్, నటరాజ్, ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

రెండు తాగునీటి బోర్లు ఏర్పాటు



జెకె సిటి ట్రస్ట్ బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కూనవరం మండలంలోని శబరి కొత్తగూడెం, చిన్నార్కూరు రెండు గ్రామాల్లో గురువారం జెకేసి ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక గిరిజనులఅభ్యర్థన మేరకు జెకెసిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ తాగునీటి బోర్లను సద్వినియోగం చేసుకోవాలని, బోర్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రత పాటించాలని సూచించారు.కార్యక్రమంలో జెకె సిటీ ట్రస్ట్ సలహాదారులు ఎడవల్లి భాస్కర్, మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు, సీనియర్ నాయకులు చెలికాని ఉమామహేశ్వరరావు, పాటి సోమయ్య, జెకె సిటీ సభ్యులు సూఫీ, రసూల్, శ్రీరామ మూర్తి, కారం కన్నారావు కారం రత్తయ్య కట్టే సాంబయ్య రమేష్ సాగర్ పాల్గొన్నారు.



డిపిటిఒతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

ఆర్‌టిసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు


కనీస వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు మంజూరు చేయాలని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పాడేరు డిపిటిఓ టి.ఉమామహేశ్వర్ రెడ్డితో సిఐటియు నాయకత్వం అవుట్సోర్సింగ్, కాంటాక్ట్ కార్మికులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు కార్మికులకు ఆర్టీసీ మంజూరు చేస్తున్న వేతనాలు అమలు చేయకుండా కోత విధిస్తున్నారని ఆయనకు వివరించారు. తక్షణం వారికి వస్తున్న వేతనాలు యధావిధంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు అమలు చేయడం లేదని తెలిపారు. వేతనాలపై కార్మికులకు తెలిసే విధంగా నోటీస్ బోర్డు పెట్టాలని తెలిపారు. అన్ కాల్ డ్రైవర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా బస్సు పాస్ సౌకర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రౌండ్ బుకింగ్ కండక్టర్స్‌కి వారంతా సెలవులు ఇవ్వాలని తెలిపారు. డిపోలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కి వేతనంతో పాటు శానిటేషన్ మెటీరియల్ ఇవ్వాలని తెలిపారు. వర్కర్స్‌కి 25 కి.మీ బస్సు పాస్ ఇస్తున్నారని, 50 కిలోమీటర్లకి పెంచాలని డిమాండ్ చేశారు. డిపోలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్స్‌కి ఇతర ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఆపరేటర్స్ మాదిరిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ జాయింట్ మీటింగ్లో సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, వర్కర్స్, టి.ప్రసాద్, యు. ప్రసాద్, సూపర్డెంట్ డివి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం

-గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రజని



ప్రజాశక్తి-చింతపల్లి : ఇటీవల చింతపల్లి ఏకలవ్య పాఠశాలపై వస్తున్న ఆరోపణలపై గురువారం రెండో దఫా విచారణ జరిపినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రజని తెలిపారు. కో ఎడ్యుకేషన్ కాబట్టి బాలురను, బాలికలను వేర్వేరుగా విచారించడం జరిగిందన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులకు సూచనలు చేసినట్లు ఆమె వివరించారు. రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం నేరుగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోకూడదన్నారు. తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలియజేయడం జరిగిందన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని, ఇప్పటి నివేదిక కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఆమె విలేకరులకు వివరించారు.

జాతీయ రహదారి నిర్మాణంలో

నాణ్యతకు తిలోదకాలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

ప్రజాశక్తి - గంగవరం : ఎన్‌హెచ్ 516 రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంగవరం బ్యాంకు వీధి రోడ్డు మధ్యలో కొత్తగా ఏర్పడిన గొయ్యి ఇందుకు నిదర్శనమని, దీనివల్ల ప్రయా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రహదారి నిర్మాణ పూర్తికాకముందే రోడ్డులోగోతులు పడడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం పనుల్లో కాంట్రాక్టర్ మొదటి నుండి నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అయినా సరైన పర్యవేక్షణలేని అధికారులు పట్టించుకోవకపోవడం వల్లే ఇలా జరుగుతోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణంలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కాంక్రీట్ వర్క్ పూర్తయిన తర్వాత వాటరింగ్ చేయలేదని అంటున్నారు. దీనిపై అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. డ్రైనేజీపై ఏర్పాటు చేసిన టైల్స్ కూడా సరిగ్గా అతుక్కోలేదని చాలాచోట్ల టైల్స్ ఊడిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనుల్లో నాణ్యత ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిఎం.వలస పంచాయతీ కార్యదర్శిపై

నేడు డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండలంలోని జిఎం.వలస గ్రామ పంచాయతీ కార్యదర్శి వనిమిశెట్టి కృష్ణప్రసాదుపై వచ్చిన ఆరోపణలపై డిపిఒ బి.లోవరాజు ఆదేశాల మేరకు రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి కె నరసింగరావు విచారణాధికారిగా ఈనెల 28న విచారణ చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్‌పై గ్రామ సర్పంచ్ కారం లక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులంతా ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేయగా, దాన్ని డిపిఒకు నివేదించగా, ఆయన స్పందించి రంపచోడవరం డిఎల్‌పిఒను విచారణాధికారిగా నియమించారు.

మారేడుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి నరసింగరావు విచారణ చేయనున్నారు.

జిఎం వలస పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలు స్థానిక ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ పాలకవర్గానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని, పీసా గ్రామసభలు సక్రమంగా నిర్వహించలేదని, వివిధ పనులపై గ్రామ సచివాలయానికి వస్తున్న గిరిజనులను చులకన చేస్తూ కించపర్చేలా మాట్లాడుతున్నారని, ఉన్నత అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ పంచాయతీ అభివృద్ధికి సహకరించడం లేదని. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసాడని, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదని, గ్రామస్థాయి సర్వేలో అలసత్వం చేస్తున్నారని ఇలా పలుఅభియోగాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై డిఎల్‌పిఒ విచారణ చేపట్టనున్నారు.

కాగా గతంలో వై రామవరం మండలం, బొడ్డగండి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సమయంలోనూ నిధులు దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యం, సత్ప్రవర్తన లేకపోవడంతో వంటి ఆరోపణతో కృష్ణప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తేసి మారేడుమిల్లి మండలం, జిఎం వలస గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేసిన తర్వాత ఇక్కడ కూడా అతని తీరు మారలేదని ఆరోపణలున్నాయి.

అదుపు తప్పి దుకాణాన్ని ఢీకొట్టిన లారీ

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన లారీ

ప్రజాశక్తి- చింతూరు : రాత్రి వేళ అదుపు తప్పి ఒక లారీ దుకాణాన్ని ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి. తెలంగాణలోని కోదాడ నుండి సిమెంటు లోడు తీసుకొని సీలేరులో అన్‌లోడ్ అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చింతూరు మండలం పోతనపల్లి వద్ద రోడ్డు పక్కన ఉన్న దుకాణాన్ని అదుపుతప్పి ఢీకొనడంతో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి సమయం అయిన ప్పటికీ, అటుగా వస్తున్న శివరాత్రి భక్తులు గమనించి, క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ను బయటకు తెచ్చి అంబులెన్స్ సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కొరకు ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న చింతూరు ఎస్సై రమేష్ తన సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని సందర్శించారు. గాయపడిన డ్రైవర్ తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వియ్యం బంజరలోని లింగం గూడెం గ్రామానికి చెందిన వాడుగా తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్



డుంబ్రిగుడ ఎమ్మెల్సీ పోలింగ్‌లో...

ప్రజాశక్తి-యంత్రాంగం

డుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో మండలంలో 93 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 76 ఓట్ల గాను 71 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సీఐ హిమగిరి ఆధ్వర్యంలో పోలీసులు పగడ్బందీ చర్యలు ఏర్పాటు చేశారు. ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ ఎస్ దొన్నుదొర మండల కేంద్రంలో సందర్శించారు. ఓటు నమోదుపై అడిగి తెలుసుకున్నారు.

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 125 ఓట్లకు గానుం 113 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి అమిత్ బర్ధార్ ఆకస్మికంగా సందర్శించారు. పోలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. స్థానిక ఎస్ఐ సురేష్ పోలింగ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో పోలింగ్ సెంటర్ 83లో మొత్తం ఓటర్లు 48 మంది ఉండగా 47 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు డిప్యూటీ తహసిల్దార్ గిడ్డి రాజు కుమార్ తెలిపారు. 98శాతం పోలింగ్ నమోదయ్యిందనాఉ.

చింతపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. స్థానిక అదనపు ఏఎస్పి నవ జ్యోతి మిశ్రా, తహశీల్దార్ రవికుమార్‌ల పర్యవేక్షణలో స్థానిక సీఐ వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు ల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లేటప్పుడు మొబైల్స్ తీసుకు వెళ్లరాదని అధికారులు సూచించారు. మొత్తం 186 ఓట్లకు గాను 160 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బాక్స్‌లను భారీ భద్రత నడుమ పాడేరు తరలించారు.

పెదబయలు: మండలంలో ఎమ్మెల్సీ ఓటింగ్ 85.84 శాతం పోలైంది. స్థానిక ఎస్ఐ కొల్లి రమణ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దార్ జి రంగారావు పర్యవేక్షించారు.

అరకులోయ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. అరకులోయలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల లోని 79వ పోలింగ్ స్టేషన్ లో మొత్తం 134 ఓట్లకు గాను 117 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 79 మంది పురుషులు కాగా, 38 మంది మహిళ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరకులోయ సీఐ హిమగిరి, ఎస్సై గోపాల్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొయ్యూరు :మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 161 ఓట్లకుగాను ఒకరు చనిపోగా, 142మంది ఓటేసినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. సాయంత్రం నాలుగుగంటలకే పోలింగ్ ప్రశాంతంగా ముగియగా, పురుషులు 86 మంది., మహిళలు 56 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. తహశీల్దార్, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలింగ్ సజావుగాసాగి

వి ఆర్ పురం: మండల కేంద్రమైన రేఖపల్లి పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 328 ఓట్లకుగాను 289మంది ఓటు హక్కు వినియోగించుకున్నార. 202 మంది పురుషులు, 87మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొనగా, 88శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధకారి వెంకటనారాయణ తెలిపారు. ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు.

మారేడుమిల్లి :. స్థానిక నీల్ ఆర్ర్యాంగ్ జిల్లా ప్రజా పరిషద్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, తహశీల్దార్ టి బాలాజీ, ఎస్ఐ షేక్ సాధ్దిక్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. 256 ఓటర్లకు గాను 216మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ్, సీనియర్ సహాయకులు కె.ఆనంద్, విస్తరణ అధికారి పి విజయకుమార్, విఆర్ఓ ఏసుబాబు, ఇంజనీరింగ్ సహాయకులు ప్రియాంక సహకరించారు.

దేవీపట్నం :దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 75. 34 శాతం ఓటింగ్ నమోదై 430 మంది ఓటర్లకు గాను 324 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 190 పురుషులు, 134 మహిళలు ఉన్నారు. ఎస్ఐ కె.షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు కల్పించగా, తహశీల్దార్ కె. సత్యనారాయణ, ఎంపీడీవో డిఎన్ రత్నకుమారి, సిడిపిఒ డి.సంధ్యారాణి పర్యవేక్షించారు. విఆర్ఒ ఉదయ్ కాంత్, రెవెన్యూ, .పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఎటపాక : స్థానిక మండలపరిషత్ కార్యాలయం పోలింగ్ బూత్‌లో 386 ఓటర్లకు గాను 273 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 70శాతం పోలింగ్ నమోదైంది. ఎటపాక సి ఐ కన్నపరాజు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అడ్డతీగల: స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 475 మంది ఓటర్లు గాను 377 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 79.37 శాతం పోలింగ్ నమోదైంది.

రాజవొమ్మంగి: స్థానిక ఎంపిపి పాఠశాలలో పట్టభద్రులఎమ్మెల్సీ ఎన్నికలలో 670 మంది ఒటర్లకు గాను 506మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 420 మంది పురుషులకు 333మంది, 253 మంది మహిళా ఓటర్లకు 173 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిసి కెమెరాల నిఘాలో తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ, రాజవొమ్మంగి సీఐ ఎన్ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రశాంతంగా ముగిసింది.ఎన్నికల అధికారులుగా ఎఒ చక్రధర్రావు ఎంఇఒ2 సూరారెడ్డి,ప్రదీప్ కుమార్,కోటేశ్వరరావు వ్యవహరించారు.

చింతూరు.: స్థానిక మంల పరిషత్ కార్యాలయంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 388మంది ఓటర్లకు గాను 311మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 80.15శాతం పోలింగ్ నమోదైంది పురుషులు 265 మంది, ఉండగా స్త్రీలు 84 మంది తమ ఓటును నమోదు చేసుకున్నారు మొత్తం 311 మంది ఓటును వినియోగించుకున్నారు.

కూనవరం :పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 458 ఓట్లకు 357 పోలయ్యాయి. 219 మంది పురుషులు, 138 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకోగా, 78 శాతం పోలింగ్ నమోదైంది.

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 326 మందికి గాను 256 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు 154 మంది పురుషులు, 102 మంది స్త్రీలు ఓటేయగా, 75.52 శాతం పోలింగ్ నమోదయ్యిందనితహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.



అల్లూరి జిల్లా గంగవరంలో క్యూలో ఉన్న ఉపాధ్యాయులు

ఓటేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సొంతమండలం రాజవొమ్మంగిలోని పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఓటును సాదారణ ఓటరు మాదిరిగానే క్యూలైన్‌లో నిలబడి వినియోగించుకున్నారు.



ఓటు వేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి

సైన్స్‌పై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి), గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది పాఠశాల విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. గత మూడు నెలలలో 13 ప్రభుత్వ పాఠశాలలలో 8125 మంది విద్యార్థులను ప్రభావితం చేసింది. ఫిబ్రవరి 28వ తేదీ జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా దీనిపై ప్రత్యేక కథనం.

విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తి కరంగా చేసి చూపించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. జిల్లా విద్యాశాఖతో కలసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారం, పెందుర్తి, తగరపువలస, భీమిలి, మద్దిలపాలెం, కొమ్మాది, ఎన్ఎడి, కె.కోటపాడు, విజయనగరం తదితర ప్రాంతాలలో గల జిల్లా పరిషత్, ఇతర పాఠశాలలలో సైన్స్ కార్యక్రమాలను చేపట్టారు.

గీతం విశ్వవిద్యాలయం నుంచి 33 మంది, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 24 మంది, గాయత్రి విద్యా సంస్థ నుంచి ఒకరు మొత్తం 58 మంది పీజీ, యుజి విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. భౌతిక, రసాయన శాస్త్రాలతో పాటు కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజి, ఫార్మశీ, సైకాలజి, నర్సింగ్, మైక్రోబయాలజి వంటి అంశాలలో ఆసక్తి కరమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల జాబితాను రూపొందించారు. ఈ బృందానికి గీతం భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.స్పందన, గీతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వివికె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు, సైన్స్ ఎడ్యుకేటర్స్ ఉదయ కాళేశ్వరరావు గుప్తా, బి.శ్రావణి నేతృత్వం వహించారు.

నేరాలు ఘోరాలు

బైక్ బోల్తా : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను భక్తులు తిలకించిన అనంతరం తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం జరిగిన ఘటనలో ప్రాణాపాయం తప్పింది. మండలంలోని గుమ్మకోట పంచాయతీ గ్రామానికి చెందిన బైక్‌పై రవి, ఇద్దరు యువతులు వెళుతుండగా బోల్తా పడింది. బొర్రా గుహలు తిలకించిన అనంతరం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో తిరుగు పర్యాయం రైల్వే గేటు సమీపంలో బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో రవి కు తీవ్రమైన గాయాలు కాగా ఇద్దరు మహిళ యువతులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులను అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసులో పదేళ్లు జైలు

ప్రజాశక్తి- లీగల్, గొలుగొండ : గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ళు కఠిన కారాగార శిక్ష, రూ. 1 లక్ష జరిమానా విధిస్తూ విశాఖపట్నం ఎంఎస్‌జె కోర్టు కం ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ట్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. సకాలంలో జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో వాదనలు వినిపించిన గ్రేడ్ వన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్‌వి.ప్రసాదరావు ఇచ్చిన సమాచారం మేరకు....

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన నిందితుడు గజ్జి సత్తిబాబు (40) తండ్రి అప్పలరాజు 2014 నవంబర్ 22న ట్రాక్టర్‌లో 183 కిలోల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి గొలుగొండ ఎస్ఐ ఎన్.జోగారావు గంజాయిని స్వాధీనం చేసుకొని క్రైమ్ నెంబర్ 121 /2014 ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు గజ్జి సత్తిబాబుపై నేరం రుజువైనందున పై విధంగా న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

ఘనంగా స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని గురువారం పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఎన్‌జిఒ ఫోరమ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఎన్‌జిఒ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గౌరవ అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటడం, పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు జివిఎంసితో కలసి పనిచేయడం అభినంద నీయమన్నారు. నగర అభివృద్ధి కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేస్తామని చెప్పారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, ఇష్టపడి చేసే సేవ నిజమైనదన్నారు. అనంతరం మేయర్‌ను సత్కరించారు.

గీతంలో ఫ్రాన్స్ విద్యాలయాల సందడి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన విశ్వవిదాలయాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దాదాపు 16 ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల నుంచి అకడమిక్ ప్రతినిధులు హజరయ్యారు. చూజ్ ఫ్రాన్స్ టూర్ పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నత విద్యా రంగంలో ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్, అవి నిర్వహిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ ప్రతినిధి బృందం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు వారితో సమావేశమయ్యారు. జిసిజిసి డైరక్టర్ వంశీకిరణ్, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సంధానకర్తగా వ్యవహరించారు.

జూ పార్కు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో గురువారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యాన జంతు సంరక్షకులకు, పరిపాలనా సిబ్బందికి ఉచితంగా సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విజయ్‌కమార్, డాక్టర్ జ్యోత్స్న జూ ఉద్యోగులకు రక్తపోటు, సుగర్ స్క్రీనింగ్‌లు, కార్డియాక్ మూల్యాంకనాలు ఇతర అవసరమైన వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, జంతు సంరక్షణ, పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న వారి శ్రేయస్సు కోసం ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.



దగ్ధమవుతున్న గడ్డి వామి

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - విఆర్.పురం: మండలంలోని రాజపేట పంచాయతీలో తోటపల్లి గ్రామానికి చెందిన ముల్లి.కన్నయ్య అనే రైతు 5 ఎకరాల గడ్డివామి గురువారం దగ్ధమైంది. ఇద్దరు మందుబాబుల నిర్వాకంతో గడ్డివామి అగ్నికి ఆహుతయ్యిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వారిపై తగు చర్యలు తీసుకుని ,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మందుబాబుల ఆగడాలపై గతంలోనూ హెచ్చరించినప్పటికీ, వారిలో ఎటువంటి మార్పురాలేదని, వీరి ఆగడాలపై అటు పోలీసులుగానీ, అధికారులుగానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇలాంటి ఘటనలు మళ్లీమళ్లీ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధితునికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు లో మద్యం అక్రమ వ్యాపారులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రవీంద్ర వెల్లడించారు. సీలేరు గ్రామం అల్లూరు వీధి గోలుపాటి బేబి ఇంటిలో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సిబ్బంది వెళ్లి దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకొని నిందితుని అదుపులో తీసుకున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్ముతున్న కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామానికి చెందిన శ్రీపతి వీర వెంకటరావు, బాబు మొజ్జులను విచారించామన్నారు. ఈ మేరకు రూ.6,750 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - అడ్డతీగల : గంగవరం విద్యుత్ ఫీడర్ నిర్వహణ, మరమ్మతులతోపాటు విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల నేపథ్యంలో ఈనెల 28న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ టి.గాబ్రియేల్ ప్రకటనలో తెలిపారు. అడ్డతీగల, వై రామవరం, రాజవొమ్మంగి.మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

1600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి - దేవీపట్నం: దేవీపట్నం మండలం దేవారం, చిన్న భీంపల్లి గ్రామాలలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో నాటు సారాయి తయారీకి సిద్ధంగా ఉన్న 1600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, మూడు కేసులు నమోదు చేసినట్లు రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు. అలాగే ఎస్ రామన్నపాలెం గ్రామంలో దాడులు చేసి పది లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరుచుకొని ఒకరిని అరెస్ట్ చేశామన్నారు.

రంపచోడవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెంటిండెంట్ ఆదేశాలతో సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీకి, రవాణా, అమ్మకాల కేసుల్లో ఉన్న పాత ముద్దాయిలను బైండోవర్ చేసినట్లు తెలిపారు. కొత్తవారు నాటుసారా అమ్మకాల వైపు రాకుండా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలపై సమాచారమిచ్చి పోలీసులకు సహకరించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. నాటుసారానియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

చెరుకు రైతుల కష్టాలు పట్టవా ?

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పూర్తి స్థాయి క్రషింగ్‌కు చర్యలు చేపట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - చోడవరం : ప్రభుత్వానికి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెరుకు రైతుల కష్టాలు పట్టవా ? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రశ్నించారు. తక్షణమే గోవాడ సుగర్స్‌లో పూర్తి స్థాయి క్రషింగ్‌కు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్‌పై ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు యాజమాన్యం ఆది నుంచీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాయన్నారు. ఎట్టకేలకు క్రషింగ్ ప్రారంభించి, రైతులందరూ చెరుకును ఫ్యాక్టరీకి తీసుకొస్తుంటే క్రషింగ్‌ను పూర్తిస్థాయిలో చేయకుండా, తరుచూ నిలిపివేయడం తగదన్నారు. క్రషింగ్‌ను నిలిపివేస్తుండటంతో రోజుల తరబడి పశువులు, ట్రాక్టర్లతో వచ్చిన రైతులు ఫ్యాక్టరీ వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతుల్లో ఆక్రోశం కట్టలు తెంచుకుని గురువారం ఫ్యాక్టరీ గేటు వద్ద భారీ ఆందోళనకు దారితీసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తెస్తానని చెప్పి నేడు పత్తా లేకుండా పోయారన్నారు. రైతాంగం ఇక్కడ ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునిగిపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో నడుస్తున్న సుగర్ ఫ్యాక్టరీల పట్ల అత్యంత నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఎలాగైనా మూత పెట్టాలని కుట్రలు పన్నుతోందని తెలిపారు. అటువంటి చర్యలకు పూనుకుంటే రైతాంగంతో కలిసి సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు గానుగాటను ఎటువంటి అంతరాయాలూ లేకుండా పూర్తి సామర్థ్యంతో చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఫ్యాక్టరీకి తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

పటిష్ట భద్రతా ఏర్పాట్లు



సముద్రతీరంలో భద్రతా ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, శివరాత్రి సముద్ర స్నానాలు ఒకేరోజు కావడంతో గురువారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆయన ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద నియమించబడిన అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలింగ్ టీంలు, మొబైల్ టీంలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేటట్లు కీలక సూచనలు చేశారు. అదేవిధంగా మహాశివరాత్రిని పురస్కరించుకొని నగరంలోని ప్రముఖ తీర ప్రాంతాలైన ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండ బీచ్‌ల వద్ద భక్తులు పుణ్య స్నానాలు నిర్వహించే చోట గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా తీర ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. సముద్రంలో ప్రమాదకర రీతిలో వెళ్లిపోయిన ఆరుగురు భక్తులను గజ ఈతగాళ్ళ సాయంతో రక్షించారు. జనసమూహంలో చిన్నారులు తప్పిపోకుండా అత్యాధునిక సాంకేతికత అయిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్ఐడి)ని ఉపయోగించి చిన్నారులు తప్పిపోకుండా చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో తప్పిపోయిన 10 మంది చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసి సంతకం చేస్తున్న ఆర్ఒ హరేంధిర ప్రసాద్

స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు భద్రం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వినియోగించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో ఓటర్లు వేసిన బ్యాలెట్ పేపర్లతో కూడిన బాక్సులు గురువారం రాత్రికి ఎయులో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్ వద్దకు చేరుకోగా వాటిని పరిశీలించి స్థానిక అధికారులు స్వీకరించారు. అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. బ్యాలెట్ పేపర్లలో కూడిన బాక్సులను భద్రపరిచిన గదులకు అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి సీలు వేశారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న అన్ని రకాల నింబంధనలనూ పాటించి సంబంధిత ప్రక్రియలను పూర్తి చేశారు. మరలా వాటిని మార్చి 3వ తేదీన అభ్యర్థుల సమక్షంలో తెరవనున్నారు.

ఐఎఫ్‌టియు విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రెండు ఐఎఫ్‌టియు విప్లవ కార్మిక సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభ మార్చి 2న రాజమండ్రి పుష్కర ఘాట్, చందా సత్రంలో జరగనున్నట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మిక వర్గంపై రుద్ది కార్మిక హక్కులను కాలరాయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. ఒక వైపున నిత్యావసర సరుకుల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతూ ఉంటే, మరో వైపు కార్మికుల వేతనాల తగ్గింపు, పనిభారాల పెంపు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బలమైన కార్మిక పోరాటం నిర్మించడానికి ఈ విలీనం దోహదపడుతుందన్నారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు వై.కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, దుర్గ, గురప్ప పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. పోసాన కృష్ణమురళి అరెస్టును ఖండిస్తూ గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్, లోకేష్ ఇద్దరి దగ్గర రెడ్ బుక్స్ ఉన్నాయని, భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ నిర్వర్తించాల్సిన బాధ్యతలను తుంగలో తొక్కుతూ కేవలం కక్షపూరిత రాజకీయాలకే వారు పరిమితమయ్యారని మండిపడ్డారు. పోసాని అరెస్టు పవన్ కల్యాణ్ ఆలోచన అని ఆరోపించారు. ప్రఖ్యాతి చెందిన ఆంధ్రప్రదేశ్ నేడు చంద్రబాబు కబంధ హస్తాలలో ఉండి ప్రపంచవ్యాప్త ఇమేజ్ డామేజ్ అవుతోందని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాళ్లే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ఎదిరించి నిలబడతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు పరిపాలన జరుగుతుందా ? అని ప్రశ్నించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములుకండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో జివిఎంసి పరిధిలో 2024 సంవత్సరానికి సంబంధించి స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రారంభమైందని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నగర ప్రథమ స్థానం లక్ష్యంగా జివిఎంసి యంత్రాంగం కృషి చేస్తోందని వెల్లడించారు. దీనిలో విశాఖ నగర ప్రజల అభిప్రాయ సేకరణ ముఖ్య భూమికని, అందుకు ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తెలియపరచాలని కోరారు.